www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 5 జులై 2024

5

అన్నమయ్య



కేంద్ర మంత్రిని కలిసిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడును ఢిల్లీలోని ఆయన ఛాంబర్‌లో రైల్వేకోడూరుకు చెందిన టిడిపి సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ మలిశెట్టి మురళీధర్‌గౌడ్, ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి చలపాటి హరినాథ్, రాజమోహన్ రాజు, తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు.



మంత్రి రామ్మోహన్ నాయుడును సన్మానిస్తున్న మురళీధర్ గౌడ్

రాష్ట్రంలోనూ కేంద్రంలోనూ ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వాలు అధికారంలో ఉన్నాయని రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కేంద్ర ప్రభుత్వం సహాయ సహకారాలు లభిస్తాయని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారని స్థానిక నేతలు తెలిపారు.

విద్యా సంస్థల బంద్ విజయవంతం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

నీట్ పరీక్షను రద్దు చేయాలని కోరుతూ ఐక్య విద్యార్థి సంఘాల పిలుపులో భాగంగా గురువారం ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన బంద్ విజయవంతమైంది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్ నాయకులు మాట్లాడుతూ నీట్ పరీక్ష లీకేజీలో భాగమైన ఎన్‌టిఎ సంస్థను రద్దు చేయాలని తెలిపారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నీటి పరీక్ష లీకేజీపై సమగ్ర విచారణ జరిపించాలని తెలిపారు. ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు స్వచ్ఛందంగా బంద్‌కు సహకరించాయన్నారు. నీట్ పరీక్ష లీకేజీకి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకొని పేద బడుగు బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. నీట్ పరీక్ష వల్ల నష్టపోయిన విద్యార్థులకు నష్టపరిహారం చెల్లించాలని, నీట్ పరీక్ష విధానాన్ని ప్రభుత్వాలకు పూర్తి అర్హతలు ఇచ్చి రాష్ట్ర ప్రభుత్వం పరిధిలో నీటి పరీక్షను నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఐక్య విద్యార్థి సంఘాలు బందును 8 డిమాండ్లతో నిర్వహించారు. ఎన్‌టిఎ వ్యవస్థను రద్దు చేయాలని, కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలని, పిహెచ్‌డి అడ్మిషన్లు కోసం ఇటీవల ఆమోదించిన తప్పనిసరి నెట్ స్కోర్ విధానాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న పరీక్షలు రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించాలన్నారు. ముంబై ఐఐటి నుండి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వరకు విద్యార్థి సంఘ నేతలపై అక్రమ కేసులు నిర్బంధాలను యూనివర్సిటీలో ప్రజాస్వామ్యాన్ని అణిచివేత చర్యలు ఆపాలని, దేశవ్యాప్తంగా పాఠశాలల మూసివేతను ఆపాలన్నారు. పైడిమాండ్లతో శాంతియుత బంద్‌ను నిర్వహిస్తున్న సందర్భంగా మదనపల్లి పోలీసు వ్యవస్థ విద్యార్థి సంఘ నేతలను అడ్డు కోవడం చాలా బాధాకరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మాధవ్, రజిల్లా కోశాధికారి వినయ్, మదనపల్లి నియోజకవర్గ సహాయ కార్యదర్శి కమలాకర్, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు విష్ణు ఉదయ్, ఎఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్** : నీట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలకు నిరసనగా విద్యార్థి సంఘాలు చేపట్టిన విద్యా సంస్థల బంద్ విజయవంతమైంది. పట్టణంలోని విద్యా సంస్థలు స్వచ్ఛందంగా సెలవును ప్రకటించాయి. కొన్ని పాఠశాలలను ఎస్ఎఫ్ఐ,



మదనపల్లె : బంద్ నిర్వహిస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు



రాజంపేట : విద్యార్థులను పాఠశాల నుంచి బయటకు పంపుతున్న నాయకులు

పిడిఎస్‌యు విద్యార్థి సంఘాల నాయకులు ప్రధానోపాధ్యాయులతో చర్చించి విద్యార్థులను బయటకు పంపించేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు నేతి నాగేశ్వర మాట్లాడుతూ నీట్ పరీక్ష నిర్వహించిన ఎన్‌టిఎ ఏజెన్సీ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు నాని, సుదర్శన్, యశ్వంత్, ప్రవీణ్, కుమార్, సాయి, ఇమ్రాన్, ప్రసాద్, వినోద్ పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వం : సిపిఎం

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

నీట్ పరీక్ష పేపర్ లీకేజీపై జిల్లా వ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ ఇతర విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్త బంద్ నిర్వహిస్తుంటే విశ్వవిద్యాలయాల్లో పేపర్ లీకేజీలు అరికట్టాల్సిన ప్రభుత్వాలు విద్యార్థులపైనా, విద్యార్థి సంఘం నాయకులపైనా కేసులు నమోదు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని సిపిఎం అన్నమయ్య జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. నూతన జాతీయ విద్యా విధానాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్రాల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీస్తూ నీట్ పరీక్ష రాష్ట్రాలకే ఇవ్వాలని చేస్తున్న దేశవ్యాప్త ఉద్యమంలో రైల్వే కోడూరులో స్వచ్ఛందంగా క్లాసులు బైకాట్ చేసి బందులో పాల్గొంటున్న విద్యార్థులను పోలీసులు అడ్డుకొని తిరిగి పాఠశాలకు పంపించడం ఏ ప్రజాస్వామ్య పద్ధతి అని ప్రశ్నించారు. నందలూరు మండలం జూనియర్ కళాశాల ఎదుట ఎస్ఎఫ్ఐ నాయకులు బంద్ నిర్వహిస్తుంటే అరెస్టు చేయడమే కాకుండా వాళ్ళని స్టేషను తీసుకెళ్లి భయభ్రాంతులకు గురి చేయడం దుర్మార్గం అన్నారు. మదనపల్లి ప్రాంతంలో ఎస్ఎఫ్ఐ నాయకులు పట్ల పోలీసులు దురుసుగా వ్యవహరించడమే కాకుండా కేసులు నమోదు చేస్తామని భయభ్రాంతులకు గురిచేయడం సిగ్గుచేటని అన్నారు. రాజంపేట పట్టణంలో పోలీసుల బందోబస్తుతో క్లాసులు జరపడం అంటే ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. శాంతియుత పద్ధతిలో విద్యార్థులకు జరిగిన అన్యాయాల పై అడగడం నేరమా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఉన్నత స్థాయి అధికారులు శాంతియుత పద్ధతిలో చేస్తున్న ఉద్యమాలకు సహకరించాలన్నారు. అణచివేతలతో, బెదిరింపులతో ఉద్యమాలను ఆపలేరని హెచ్చరించారు.

స్వరాజ్య సంగ్రామ చరిత్రలో 'అల్లూరి' మహోజ్వల శక్తి

- జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

ప్రజాశక్తి - రాయచోటి

స్వరాజ్య సంగ్రామ చరిత్రలో అల్లూరిసీతారామరాజు ఒక మహోజ్వల శక్తి అని, ఆయన దేశభక్తి, ధైర్యాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ పేర్కొన్నారు. గురువారం రాయచోటి కలెక్టరేట్లో వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి చిత్రపటానికి జాయింట్ కలెక్టర్ పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ మన్యం వీరుడు అల్లూరి స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను తృణప్రాయంగా త్యాగం చేసిన మహనీయుడన్నారు. ఇతడు జరిపిన సాయుధ పోరాటం స్వాతంత్ర్య ఉద్యమంలో ఒక ప్రత్యేక అధ్యాయం. నిరక్షరాస్యులు, నిరుపేదలు, అమాయకులకు అండగా నిలిచి, బ్రిటీషు సామ్రాజ్యమనే మహా శక్తిని ఢీకొన్నాడని పేర్కొన్నారు. ఆయన చూపిన ధైర్యం తెగువ భావితరాలకు ఆదర్శం కావాలన్నారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ సత్యనారాయణరావు, బిసి సంక్షేమ శాఖ అధికారి సందప్ప, కలెక్టరేట్ ఎఒ గోవిందసింగ్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. **నందలూరు:** మండలంలోని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీ అరవపల్లి ఆర్అండ్‌బి అతిథి గృహ సమీపంలో గురువారం అల్లూరి సీతారామరాజు 127వ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ జంబు సూర్యనారాయణ మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు మన్యం గుడిలో కొలువైన దేవుడన్నారు. నెత్తురు మండే యువతకు ఆరాధ్యుడని తెలిపారు. బ్రిటిష్ సామ్రాజ్యాన్ని హడలెత్తించిన ధీరుడన్నారు. తూటాలకు గుండెను ఎదురుపెట్టిన యోధుడు, వందేమాతరాన్ని రణంగా మార్చిన శూరుడని తెలిపారు. దేశ ప్రజలకు స్ఫూర్తి, స్వాతంత్ర్య విప్లవ వీరుడు, భారతదేశ పౌరులందరికీ అల్లూరి సీతారామరాజు జీవిత ఒక ఆదర్శమని తన అనుకున్న లక్ష్యం కోసం తన ప్రాణాన్ని సైతం లెక్కచేయకుండా బ్రిటిష్ వారి పైన పోరాడిన గొప్ప యోధుడు అల్లూరి సీతారామరాజు అని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా మాజీ వక్ఫ్ బోర్డ్ కార్యదర్శి సయ్యద్ అమీర్, తాటి సుబ్బరాయుడు, మోడపోతుల రాము,గోపీనేని



రాయచోటి : అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

హిమగిరి నాథ్ యాదవ్, షేక్ మౌల,తుమ్మాది శివకుమార్, శివ నరసింహులు, తుంటి రమణయ్య పాల్గొన్నారు. **బి.కొత్తకోట** : ఆంగ్లేయులు వెన్నుల్లో వణుకు పుట్టించి, భారతీయుల్లో స్ఫూర్తి నింపిన మన్యం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు అని నగర పంచాయతీ కమిషనర్ పి.ఆర్.మనోహర్ పేర్కొన్నారు. నగర పంచాయతీ కార్యాలయంలో అల్లూరి జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాసులు, జూనియర్ అసిస్టెంట్ కిరణ్ కుమార్, నగర పంచాయతీ కార్యాలయపు సిబ్బంది పాల్గొన్నారు. **రైల్వేకోడూరు** : స్వాతంత్ర సమరయోధులు మన్యం వీరులు అల్లూరి సీతారామరాజు జయంతి సందరరేగా ఆయన విగ్రహానికి టిడిపి ఇన్‌ఛార్జి ముక్కా రూపనందరెడ్డి సతీమణి ముక్కా వరలక్ష్మి, క్షత్రియ నాయకులు రవికుమార్ రాజు, వెంకటేశ్వరరాజు, డి.కృష్ణంరాజు, రాజశేఖర్ రాజు, కొప్పరపు అరవింద్, మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం వరలక్ష్మి కేక్ కట్ చేసి అల్లూరి అభిమానులకు పంచిపెట్టారు. **రామసముద్రం** : మండల పరిషత్ కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు 127వ జయంతి సందర్భంగా ఎంపిడిఒ బానుప్రసాద్ అల్లూరి సీతారామ రాజు చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులార్పించారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు17 నెలల జీతం ఇవ్వాలి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

ప్రజాశక్తి - రాయచోటిటౌన్

ప్రకృతి వ్యవసాయంలో పనిచేస్తున్న ఉద్యోగులకు 17 నెలల జీతాలు ఇవ్వాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు అన్నారు. గురువారం జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గౌరవేతనం లేక కుటుంబాల పోషణ, పిల్లల చదువులు, ఆరోగ్యం, కుటుంబ అవసరాలకు చాలా ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా, జిల్లా అధికారులు, రాష్ట్ర అధికారులు దృష్టికి పలు దఫాలుగా సమస్యలు విన్నవించినప్పటికీ పదేపదే హామీ ఇస్తూ కాలయాపన చేశారని చెప్పారు. 17 నెలల గౌరవ వేతనాలు ఎపిసిఎన్ఎఫ్ ప్రాజెక్టు వారు జీతాలు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ ఉద్యోగుల సంఘం జిల్లాఅధ్యక్ష కార్యదర్శులు మధుకర్ సిద్దయ్య మాట్లాడుతూ ఇప్పటికైన బకాయి వేతనాలు ఇచ్చి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. పిల్లల చదువులకు ఇంటిఅద్దెలతో పాటు చేసిన అప్పుకు వడ్డీ చెల్లించలేక ఇక్కట్లకు గురవుతున్నట్టు తెలిపారు. స్పందించిన జెసి అధికార యంత్రాంగంతో మాట్లాడి పెండింగ్ జీతాల విడుదలకు కృషి చేస్తామని తెలిపారు. అనంతరం వ్యవసాయ శాఖ జెడి చంద్రనాయక్‌కు కూడా వినతిపత్రం అందజేశారు. పెండింగ్ జీతాల కోసం దశల వారి ఉద్యమాలు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ధనశేఖర్, ఎస్.వి. రమణ, రామాంజులు, కృష్ణయ్య వెంకటరామిరెడ్డితో పాటు ప్రకృతి ఉద్యోగులు పాల్గొన్నారు.

అర్హులైన వారికే పింఛన్లు ఇవ్వాలి : జెసి

ప్రజాశక్తి-రామాపురం

పింఛన్లు అర్హులైన వారికే ఇవ్వాలని అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్ పర్మన్ అహ్మద్ ఖాన్ అన్నారు. మండలంలోని హసనాపురంలో గురువారం సాయంత్రం హసనాపురం వడ్డేపల్లి, కుమ్మరపల్లి, చీకటి వాండ్లపల్లి. గ్రామాల్లో పింఛన్లు తీసుకుంటున్న లబ్ధిదారులపై ఆయన విచారణ చేపట్టారు. గ్రామానికి చెందిన నాయకులు, గ్రామస్తులు ఇటీవల రామాపురం ఎంపిడిఒ ప్రభాకర్‌రావుకు పింఛన్ల అక్రమాలపై ఫిర్యాదు చేశారు. గతనెల 13న కలెక్టర్, డిఆర్‌డిఎ పీడీ దృకి కూడా తీసుకెళ్లారు. ఈ మేరకు గురువారం జెసి పర్మాన్ అహ్మద్‌ఖాన్ వడ్డేపల్లి హసనాపురం. ఎర్రంగి వాండ్ల, చీకటి వాండ్ల పల్లి, కుమ్మరపల్లి గ్రామాల్లో ఆయన పర్యటించి పింఛను లబ్ధిదారులను విచారించారు. గ్రామ వెల్ఫేర్ అసిస్టెంట్ మల్లికార్జునను గ్రామంలోకి వెళ్లి విచారించి నివేదిక పంపాలన్నారు. యర్రంగి వాండ్లపల్లిలో ఒకే కుటుంబంలో ఏడు పింఛన్లు వస్తున్నాయని జెసి దృష్టికి తీసుకెళ్లారు. జెసి వెంట పంచాయతీ కార్యదర్శి ఓబులమ్మ, ఇన్‌ఛార్జి విఆర్‌ఒ ఫాతిమా, ఎంపిడిఒ కార్యాలయ ఎఒ రవికుమరా; వెల్ఫేర్ అసిస్టెంట్ రామ్మోహన్, గ్రామస్తులు పాల్గొన్నారు.



హసనపురంలో పింఛన్లపై విచారిస్తున్న జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్



జెసికి వినతిపత్రం ఇస్తున్న మున్సిపల్ ఫెడరేషన్ నాయకులు

పెండింగ్ పిఎఫ్ సొమ్ము ఏమైంది?

-ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ డిమాండ్

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

మున్సిపల్ కార్మికుల 19 సంవత్సరాల పిఎఫ్ ఏమైందని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) అన్నమయ్య జిల్లా అధ్యక్షులు, ఉపాధ్యక్షుడు బివి రమణ, ఎం. చెన్నయ్య ప్రశ్నించారు. గురువారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలో జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌కు వినతిపత్రం ఇచ్చారు అనంతరం వారు మాట్లాడుతూ గతంలో 2005 నుండి ఇప్పటి వరకు మున్సిపల్ కార్మికుల పిఎఫ్ ఖాతాలు మూడుగా ఉండేవని ఆ సొమ్ము అంతా ఒక పిఎఫ్ ఖాతాగా మర్చి ఇవ్వాలని అనేక సార్లు అధికారులను పాలకులకు విన్నవించినా ప్రయోజనం లేదన్నారు. డ్రైవర్లకు రూ.24,500 వేతనం ఇవ్వాలని జిఒ ఉన్నప్పటికీ అన్నమయ్య జిల్లాలోని రాయచోటి మున్సిపాలిటీలో మాత్రం వైసిపి పాలకవర్గం అమలు చేయకుండా మోకాలడ్డుతోందన్నారు. అప్కాస్‌లలో పని చేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. ఎన్నికలలో రెండు, మూడు రోజుల పాటు పని చేసిన కార్మికులను స్టైఫండ్ ఇచ్చారని, రాజంపేట,రాయచోటి మున్సిపాలిటీలలో కూడా వెంటనే ఇవ్వాలని పేర్కొన్నారు. ఇంజినీరింగ్ కార్మికులకు స్కిల్డ్, సెమిస్కిల్డ్ వేతనాలు ఇవ్వాలని, క్లాప్ డ్రైవర్లకు కనీస వేతనం రూ.18,500 అమలు చేయాలన్నారు. కార్మికులకు నాణ్యమైన పనిముట్లతో పాటు మాస్కులు, కొబ్బరినూనె, చెప్పులు గ్లౌజులు ఇవ్వాలని కోరారు.

'తల్లికి వందనం' ప్రభుత్వ బడులకే వర్తింపజేయాలి

ప్రజాశక్తి-కలికిరి

ప్రభుత్వం అమలు చేయదలచిన తల్లికి వందనం పథకం కేవలం ప్రభుత్వ బడులలో చదివే పిల్లలకే వర్తింపజేసి గ్రామీణ బడుల మనుగడకు ముప్పు వాటిల్ల కుండా చర్యలు చేపట్టాలనీ ఎపిఇఎఫ్ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు కుమార్ యాదవ్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం తీసుకొచ్చిన 117 జిఒను రద్దుపరచి 1-5 తరగతులను గతంలో వలెనే ప్రాథమిక పాఠశాలలో కొనసాగేలా చూడాలని తెలిపారు. ఉపాధ్యాయులకు పదుల సంఖ్యలో రకరకాల యాప్‌లు తగ్గించాలని, నాడునేడు పనుల భారం నుండి పూర్తిగా తప్పించాలని కోరారు. విద్యాహక్కు చట్టం ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో బడి అందుబాటులో ఉండి, సరిపడా ఉపాధ్యాయులు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. నాణ్యమైన విద్య అందించే అవకాశం, కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.



మంచినీటి ట్యాంకులను పరిశీలిస్తున్న డిఎల్‌పిఒ పార్వతి

తాగునీటి ట్యాంకులను క్లోరినేషన్ చేయాలి : డిఎల్‌పిఒ

ప్రజాశక్తి-నందలూరు

మంచినీరు సరఫరా చేస్తున్న ట్యాంకులలో క్లోరినేషన్ నిర్వహించి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని రాజంపేట డివిజనల్ పంచాయతీ అధికారిని పార్వతి అన్నారు. గురువారం నందలూరు మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీలోని పలు మంచినీటి ఉపరితల ట్యాంకులను పరిశీలించారు. ఈ సందర్భంగా పంచాయతీ సిబ్బందికి పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ట్యాంకులు శుభ్రంగా ఉంచాలని ప్రజలకు సరఫరా చేసే తాగు నీరు పరిశుభ్రంగా అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయ సర్పంచ్ జంబు సూర్యనారాయణ. కార్యదర్శి శ్రీనివాసులు సిబ్బంది పాల్గొన్నారు.



ఎరువుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న ఎడిఎ

37.65 టన్నుల ఎరువుల అమ్మకాలు నిలుపుదల : ఎడిఎ

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

ఎరువులు, పురుగుమందుల అమ్మకాలలో ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు పాటించుకుంటే డీలర్లపై చట్టపరమైన చర్యలు తప్పవని రాయచోటి సహాయ వ్యవసాయ సంచాలకులు కె.శ్రీలత తెలిపారు. గురువారం మండల వ్యవసాయ శాఖాధికారి మురళీమోహన్‌తో కలిసి నిమ్మనపల్లిలోని ఎరువులు, పురుగు మందుల విక్రయాల దుకాణాలలో ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు రికార్డులను, స్టాకు రిజిస్టర్లను, బిల్లు పుస్తకాలను పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు మాత్రమే ఎరువులను రైతులకు విక్రయించాలని, అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. నిమ్మనపల్లెలోని బాలాజీ ఫర్టిలైజర్స్ దుకాణం యజమాని ప్రభుత్వ అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న గోడౌన్‌లో నిల్వ ఉంచిన 37.65 టన్నులు ఎరువుల అమ్మకాలను నిలుపుదల చేస్తూ బాలాజీ ఫర్టిలైజర్స్ దుకాణదారునికి ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి వ్యాపారాలు చేసే దుకాణదారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎరువుల దుకాణాల్లో క్రమం తప్పకుండా తనిఖీలు చేస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో సచివాలయ వ్యవసాయ సహాయకులు శ్రీకాంత్, కుమార్ నాయక్, డీలర్లు పాల్గొన్నారు.



అధికారులతో సమావేశమైన డిటిఒ భరత్ చవాన్

దళారులను నమ్మి మోసపోవద్దు : డిటిఒ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రవాణా శాఖ కార్యాలయంలో అందుతున్న సేవలను దళారులను నమ్మి మోసపోవద్దని డిస్ట్రిక్ట్ ట్రాన్స్ పోర్ట్ ఆఫీసర్ (డిటిఒ) భరత్ చవాన్ స్పష్టం చేశారు. ఆన్‌లైన్ ద్వారా అన్నిరకాల సేవలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. గురువారం మదనపల్లె ఆర్‌టిఒ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ ప్రజలు నేరుగా సేవలు పొందేందుకు అనువైన వాతావరణాన్ని కల్పించాలని సూచించారు. ముఖ్యంగా దళారులను, డ్రైవింగ్ స్కూల్ ప్రతినిధులను ప్రోత్సహించకుండా నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రతి రోజు ఫీల్డ్‌కు వెళ్లి రికార్డు లేని వాహనాలను సీజ్ చేయాలని తెలిపారు. కార్యాలయానికి ఎవరు వచ్చినా వారి సమస్యలను సానుకూలంగా విని వారికి అవసరమైన సేవలను అందించాలని తెలియజేశారు. ఈ సందర్భంగా డిటిఒ విలేకరులతో మాట్లాడుతూ గతంలో కంటే ఇప్పుడు మోటార్ వెహికల్ కార్యాలయంలో సేవలు చాలా సులభతరం అయ్యాయని తెలిపారు. ముఖ్యంగా పాఠశాలల బస్సులకు ఎఫ్‌సి విషయంలో కఠినంగా వ్యవహరిస్తున్నామని, ప్రతి రికార్డును పరిశీలిస్తున్నామన్నారు. రికార్డు లేని వాహనాలు తిరగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రజలు దళారులను, మధ్యవర్తులను నమ్మకుండా నేరుగా కార్యాలయానికి వచ్చి తమ సేవలను వినియోగించుకోవాలని, అన్ లైన్ లో అందుబాటులో ఉన్న సేవలను ఇంటి వద్ద నుంచే పొందవచ్చునన్నారు. డిటిఒతో ఎంవిఐ దినేష్ చంద్ర, ఎఎంవిఐలు శివలింగయ్య, శ్రీహరి ఉన్నారు.

ఉత్తమ సేవలు అందించాలి

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

గ్రామ వార్డు, సచివాలయాల నుంచి ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలని మదనపల్లె డివిజనల్ పంచాయతీ అధికారి లక్ష్మీపతి అన్నారు. గురువారం మండల పరిధిలోని రాచవేటివారిపల్లె గ్రామ సచివాలయాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఉద్యోగుల హాజరు పట్టికను, ప్రజలకు అందుతున్న సేవల వివరాలను, సచివాలయ నిర్వహణను పరిశీలించారు. అనంతరం సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించి వివిధ సేవలకై సచివాలయ కార్యాలయానికి వచ్చే ప్రజలను, రైతులను ఆప్యాయంగా పలకరిస్తూ వారికి ఉత్తమ సేవలు అందించాలని సూచించారు. ఉద్యోగులు క్రమశిక్షణ కలిగి ఉండాలన్నారు. ఉదయం, సాయంత్రం సమయపాలన పాటించాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలని తెలియజేశారు. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న డిఎల్‌పిఒ లక్ష్మీపతి

ప్రజా సమస్యలపై దృష్టి సారించండి : 'నల్లారి'

ప్రజాశక్తి-కలికిరి

ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని అధికారులకు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి సూచించారు. పీలేరు ఎమ్మెల్యేగా గెలుపొందడంతో తొలిసారి కలికిరి మండల ప్రజా పరిషత్ కార్యాలయం రావడంతో ఆయనకు మండల శాఖ అధికారులు ఘన స్వాగతం పలికారు. అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఆయన చిత్ర పఠానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత స్వాతంత్ర్యం కోసం, మన్యం ప్రజల హక్కుల కోసం పోరాడి అతి చిన్న వయసులోనే ప్రాణ త్యాగం చేసిన విప్లవజ్యోతి అల్లూరి సీతారామరాజు అంటూ కొనియాడారు. అనంతరం మండల శాఖ అధికారులతో స్థానిక సమస్యలపై అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ, గడచిన ఐదేళ్లు పట్టణంలో ఎక్కడి పనులు అక్కడే అగాయని, అభివృద్ధి పడకవేసిందన్నారు. కలికిరి పట్టణానికి నల్లారి కుటుంబ వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి చేసి, కేంద్ర, రాష్ట్ర, ప్రయివేటు సంస్థలు ఏర్పాటు చేసి పట్టణంలోని భూములకు విలువలు వచ్చేటట్టు చేశామని పేర్కొన్నారు. వైసిపి నాయకులు గ్యాంబ్లింగ్, బెట్టింగ్ లాంటి అసాంఘీక కార్య కలాపాలకు అడ్డాగా మార్చారని, పచ్చగా ఉండే పట్టణానికి మచ్చ తెచ్చారని మండిపడ్డారు. అధికారులపై ఒత్తిడి తెచ్చి మీ చేత కూడా తప్పులు చేయించారని, అవన్నీ నా దృష్టికి వచ్చాయన్నారు. అధికారం ఎవ్వరికి శాశ్వతం కాదని ప్రజలు అధికారాన్ని ఇచ్చేది సేవ చేయడానికి మాత్రమేనని తమ స్వప్రయోజనాల కోసం కాదన్నారు. పట్టణ, గ్రామ శివారుల్లో ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలపై దృష్టి సారించి తమ వరకు ఫిర్యాదులు రాకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో నల్లారి చంద్రారెడ్డి, లక్ష్మికర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు నిజాముద్దీన్, ఉపాధ్యక్షుడు రెడ్డప్ప రెడ్డి, ఎంపిడిఒ రామకృష్ణ, తహాశీల్దార్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కిషోర్‌రెడ్డి



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ భాను లక్ష్మీదేవి

అంగన్వాడీ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

మండల పరిధిలోని అగ్రహారం పంచాయతీలో ఉన్న అగ్రహారం, బండమీదపల్లె అంగన్వాడీ కేంద్రాలను గురువారం సూపర్వైజర్ భాను లక్ష్మీదేవి ఆకస్మికంగా తనిఖీ చేశారు. బండమీదపల్లెలోని మినీ అంగనవాడి కేంద్రం వద్ద గర్భిణులు, బాలింతలతో, చిన్నపిల్లల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేశారు. చెడిపోయిన కోడి గుడ్లను ఇస్తున్నారని, సొంత ఇంటిలోనే మినీ అంగన్వాడీ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారని చిన్నపిల్లల తల్లిదండ్రులు సూపర్వైజర్ దృష్టికి తీసుకువచ్చారు. అంగన్వాడీ కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, క్రమం తప్పకుండా చిన్నపిల్లలకు, గర్భిణులకు, బాలింతలకు నాణ్యతతో కూడిన పౌష్టికాహారాన్ని అందించాలని, విద్యార్థుల హాజరును తప్పకుండా నమోదు చేయాలని అంగన్వాడీ సిబ్బందికి సూచించారు. అనంతరం స్థానికులతో చర్చించి బండమీద పల్లెలోని ఖాళీగా ఉన్న మరో ఇంటిలో మినీ అంగన్వాడీ కేంద్రాన్ని నిర్వహించాలని ఆదేశించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ విద్యా సంక్షేమ సహాయకులు జావిద్ బాష, మహిళా సంరక్షణ కార్యదర్శి శ్రీలేఖ పాల్గొన్నారు.

నేటి నుంచి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి - నందలూరు

నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతి అరవపల్లిలోని నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో దివంగత తుంటి యానాదయ్య, సరోజమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు తుంటి నందాయాదవ్ ఆధ్వర్యంలో నందలూరు ప్రీమియర్ లీగ్ 9వ సీజన్ నందలూరు, ఒంటిమిట్ట, సిద్ధవటం మండలాల స్థాయిలో హార్ట్ టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్ జూలై 5వ తేదీ గురువారం నుండి నిర్వహించనున్నట్లు ఆర్గనైజర్ పల్లె గ్రీష్మంత్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఈ టోర్నమెంట్‌లో విజేతగా నిలిచిన వారికి మొదటి బహుమతి రూ.40 వేలు, ద్వితీయ బహుమతి రూ.25 వేలు ఇస్తామని పేర్కొన్నారు.



చెరువులో చేప పిల్లల్ని వదులుతున్న అధికారులు

ఆరోగ్యానికి హాని చేసే ప్రధాన కారకాలు దోమలు

- జిల్లా మలేరియా నివారణ అధికారి బి.వేణుగోపాల్

ప్రజాశక్తి-పీలేరు

ఆరోగ్యానికి హాని చేసే ప్రధాన కారకాలైన దోమల వృద్ధికి అడ్డుకట్ట వేయడం మనందరి బాధ్యతని జిల్లా మలేరియా నియంత్రణ అధికారి బి.వేణుగోపాల్ తెలిపారు. దోమల నివారణ, నియంత్రణలో భాగంగా గురువారం వేణుగోపాల్ తమ సిబ్బందితో కలిసి పీలేరు పట్టణ పరిసరాల్లో నీరు నిలువ ఉండే మురుగు నీటి గుంటల్లో గంబుసియ చేప పిల్లలు' వదిలారు. దోమలు వృద్ధిచెందే కీలక దశలో ఒకటైన నీటిలోని లార్వాలను చేపలు ఆహారంగా స్వీకరించడం ద్వారా దోమల వృద్ధిని నిర్మూలించవచ్చని చెప్పారు. దోమ కాటుతో సంభవించే మలేరియా, డెంగీ, చికున్ గున్యా, మెదడు వాపు, బోధకాలు వంటి వ్యాధుల నియంత్రణకు ఫ్రైడే-డ్రైడేగా పాటించాలని, కిటికీలకు మెష్ అమర్చడం, నీటి నిల్వలపై మూతలు పెట్టడం, పరిసరాల పరిశుభ్రత పాటించడం వంటి చర్యలు వ్యాధుల నియంత్రణకు దోహదం చేస్తాయని తెలిపారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారులు విద్యాసాగర్, ముజీబ్, హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య, పర్యవేక్షకులు కుసుమ, ఎఎన్ఎంలు భార్గవి, లావణ్య, సిహెచ్ఒ చంద్రకళ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



సినిమా థియేటర్‌లో తనిఖీ చేస్తున్న ఆర్‌డిఒ రంగస్వామి

సినిమా థియేటర్లను తనిఖీ చేసిన ఆర్‌డిఒ

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు పట్టణంలోని సుకూర్ పిక్చర్ ప్యాలెస్ సినిమా థియేటర్‌ని ఆర్‌డిఒ యు.రంగస్వామి తనిఖీ చేశారు. గురువారం సాయంత్రం ఆయన సినిమా థియేటర్ లోపల, వెలుపల, పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలిసిన మీడియాతో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం థియేటర్లో సినిమా ప్రేక్షకులకు సౌకర్యాలు ఉన్నాయా లేదా అన్న కోణంలో తనిఖీలు చేశామని తెలిపారు. తనిఖీ నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించడం జరుగుతుందని చెప్పారు. తనిఖీల్లో స్థానిక తహశీల్దారు మహబూబ్ బాష, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా 'వంగవీటి' జయంతి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఆరని ఉజ్వల జ్యోతి వంగవీటి మోహనరంగా అని బలిజ సేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సంబావు వెంకటరమణ తెలియజేశారు. వంగవీటి మోహనరంగా 77వ జయంతిని పురస్కరించుకుని గురువారం గీతాంజలి జూనియర్ కళాశాలలో బలిజ సేన ఆధ్వర్యంలో వంగవీటి చిత్రపటానికి పూల మాలవేసి ఘన నివాళులర్పించారు. ఈ సందరరేగా బలిజ సేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సంభావు వెంకటరమణ మాట్లాడుతూ తరాలు మారినా గుర్తుండిపోయే పేరు వంగవీటి అని, ఆయన బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, నిరుపేదల పెన్నిధి, మొక్కవోని ధీరుడు అని కొనియాడారు. లక్షలాదిమందికి అండగా నిలబడి ఆయన ఆదర్శప్రాయుడయ్యారని తెలిపారు. ఆ మహనీయుడికి నివాళులర్పించడం గర్వకారణమని తెలియజేశారు. కార్య క్రమంలో బలిజ సేన జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, న్యాయ వాదులు కృష్ణకుమార్, చంద్రమౌళి, బలిజ సేన ప్రతినిధులు ప్రతి సుబ్బరా యుడు, నీలి రవీంద్ర బాబు, అబ్బిగారి గోపాల్, సుబ్బ నరసయ్య, చల్లా సుధా కర్, వినయ్ బాబు, సుదర్శన్ థియేటర్ అదృష్ట, ప్రభాకర్ నాయుడు పాల్గొన్నారు.



వంగవీటి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బలిజ సేన నాయకులు

చినుకు పడితే చిత్తడే..!

- నీటి కుంటను తలపిస్తున్న సిమెంట్ రోడ్డు
- రోడ్డుపై నడవాలంటే హడలిపోతున్న ప్రజలు

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని రెడ్డిపల్లి గ్రామం సచివాలయం నుంచి ప్రాథమిక పాఠశాల వరకు ఉన్న రహదారి బురదమయంగా మారింది. చినుకు పడితే చిత్తడే చిత్తడే. గత ప్రభుత్వంలో అనేకమార్లు గ్రామ ప్రజలు అర్జీలు సమర్పించిన చెత్తబుట్టలకే పరిమితం అయ్యాయని పలువురు గ్రామ ప్రజలు కోరుతున్నారు. ప్రభుత్వం మారింది తీరు మారాలని కొందరు గ్రామ ప్రజలు చర్చించుకుంటున్నారు. రైల్వేకోడూర్ టిడిపి ఇన్‌ఛార్జి మూక్క రూపా నందరెడ్డి చొరవ తీసుకొని తమ గ్రామ సమస్యను వెంటనే పరిష్కరించాలని పలువురు ప్రజలు కోరుతున్నారు. వర్షం వచ్చిందంటే అటువైపు వాహనాల కథ దేవుడి ఎరుగు గ్రామ ప్రజలు అటువైపు వెళ్లాలంటే భయాందోళనకు గురవుతున్నారు. గతంలో ఆర్‌అండ్‌బి వాళ్ళు వచ్చి కొలతలు వేసుకొని సమ స్యను పరిష్కరిస్తామని చెప్పి వెళుతున్నారే తప్ప సమస్యను పరిష్కరించడం లేదని గ్రామ ప్రజలు వాపోతున్నారు. ఈ సిమెంట్ రోడ్డు గ్రామ పంచాయతీ పరిధిలోది కాదని ఆర్‌అండ్‌బి సంబంధించిన రోడ్డుగా మండల ప్రజా పరిషత్ అధికారులు చెబుతున్నారు. రానున్నది వర్షాకాలం కాబట్టి గ్రామ ప్రజల విజ్ఞప్తి మేరకు తక్షణ చర్యలు ప్రారంభించాలని పలువురు ప్రజలు కోరుతున్నారు. ఈ రోడ్డులో గతంలో వృద్ధులు వికలాంగులు అనేకమార్లు



మురుగు కుంటను తలపిస్తున్న సిమెంట్ రోడ్డు

పడి ప్రయాణాలు రద్దయిన సమయాలు చాలా ఉన్నాయని గ్రామ ప్రజలు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, నాయకులు తమ సమస్యను పరిష్కరించాలని గ్రామ ప్రజలు వేడుకుంటున్నారు. సిమెంట్ రోడ్డు మీద నిల్వ ఉన్న నీటి వల్ల గ్రామంలో అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని గ్రామ ప్రజలు చెబుతున్నారు. చాలా కాలం నుంచి ఈ సమస్య ఇలాగే ఉందని ఏ అధికారికి, ఏ రాజకీయ నాయకుడికి చెప్పినా కూడా ఫలితం లేదని, ప్రభుత్వం మారింది తీరు మారుతుందని గ్రామ ప్రజలు కోరుకుంటున్నారు.

డయేరియా నియంత్రణ మన చేతుల్లోనే : డిఐఒ



డయేరియాపై అవగాహన కల్పిస్తున్న డిఐఒ డాక్టర్ ఉషశ్రీ

ప్రజాశక్తి-కలికిరి

డయేరియా నియంత్రణ మన చేతుల్లోనే ఉన్నదని డిఐఒ డాక్టర్ ఉషశ్రీ తెలిపారు. మండలంలోని మెడికుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి లోని గుండ్లూరు గ్రామంలో నిర్వహిస్తున్న 104 వైద్య సేవలను మరియు పెద్దల బిసిజి టీకాల కార్యక్రమాన్ని అన్నమయ్య జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ఉషశ్రీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాప్ డయేరియా కార్యక్ర మంలో భాగంగా పర్యవేక్షణ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 0 నుండి 5 సంవత్సరాలలో పిల్లల గృహ సర్వేలు నిర్వహించి ఒఆర్ఎస్ క్యాంపెయిన్, డమాస్ట్రేషన్ చేయాలని స్టాఫ్ డయేరియా గురించి వివరించారు. గ్రామాల్లో ఆశా కార్యకర్తలు ఆరోగ్య కార్యకర్తలు ఎంఎల్‌హెచ్‌పిలు స్టాప్ డయేరియా గురించి ఒఆర్ఎస్, జింక్ టాబ్లెట్స్ గురించి విస్తృతంగా ప్రచారం చేయాలని ఒఆర్ఎస్ కార్నర్స్ ఎక్కువ సంఖ్యలో పెట్టాలని గ్రామాలలో ఇంటి పరిసరాలు మరియు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని తెలిపారు. బాలింత సంరక్షణను పాటించాలని చెప్పారు. సురక్షితమైన ఆహారం, మంచి నీరు బిడ్డలకి ఇవ్వాలని పేర్కొన్నారు. పాలిచ్చే తల్లులు ఆవశ్యకతను గురించి తెలియపరచాలని తెలిపారు. అనంతరం హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ ఒఆర్ఎస్ ద్రావణాన్ని ఎలా తయారు చేసుకోవాలని పేర్కొన్నారు. చేతుల శుభ్రతలోని 6 దశలను చేసి చూపించారు. అనంతరం డయేరియా నియంత్రణ కార్యక్రమం బ్యానర్, పోస్టర్స్, బ్రోచర్లు ఆవిష్కరించారు. పెద్దలకు బిసిజి వ్యాక్సిన్ వేయించారు. కార్యక్రమంలో వైద్యులు చిన్నరెడ్డెప్ప, పర్యవేక్షకులు నాగిరెడ్డి, హేమలత, ఎంఎల్‌హెచ్‌పి నాగవేని, ఎఎన్ఎం ప్రభావతి ఆశా కార్యకర్తలు రెడ్డికుమారి, వెంకటలక్ష్మి, దివ్య పాల్గొన్నారు.

అనాథ పిల్లల సేవే పరమావధి : ఆనంద్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అనాథ పిల్లలే తన ఆస్థిగా భావించి 22 ఏళ్లుగా వారికి అండగా ఉంటున్నానని చైతన్య సర్వీసస్ ఫౌండర్ ఆనంద్ అన్నారు. ఆయన 64వ జన్మదిన వేడుకలు గురువారం దేవతానగర్‌లోని చైతన్య సర్వీసస్ సొసైటీలో చిన్నారుల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అడ్మినిస్ట్రేటివ్ అధికారి డాక్టర్ జివిఎస్ బాబు మాట్లాడుతూ పట్టణంలోని స్థానిక బర్మా రోడ్డులో 2002లో చైతన్య సర్వీసెస్ సొసైటీని ఆనంద్ స్థాపించారన్నారు. ఆ సమయంలో కేవలం ఐదు మంది విద్యార్థులతో ప్రారంభించిన చైతన్య సర్వీస్ సొసైటీ నేడు వంద మంది విద్యార్థులకు ఆశ్రయమిచ్చి సేవలు అందిస్తుందని తెలిపారు. ప్రస్తుతం చైతన్య సర్వీసెస్ సొసైటీలో ముత్తు ఇంగ్లీష్ మీడియం పాఠశాల నడుస్తోందని వంద మంది విద్యార్థులు ఇక్కడ విద్యను అభ్యసిస్తున్నట్లు తెలిపారు. ప్రతి విద్యార్థిని అక్కున చేర్చుకొని ఆశ్రయం కల్పించడంతో పాటు నాణ్యమైన విద్యను ఉచితంగా అందించడం జరుగుతోందన్నారు. చైతన్య సర్వీసస్ సొసైటికి ఎలాంటి నిధులు లేవని కేవలం దాతలు అందిస్తున్న సహాయ సహకారాలతోనే ఇంతటి గొప్ప కార్యక్రమాలను కొనసాగిస్తున్నట్లు సొసైటీ నిర్వాహకులు ఆనంద్ తెలిపారు.



సొసైటీ నిర్వాహకులతో ఆనంద్ జన్మదిన వేడుకలు

అనంతరం కేక్ కట్ చేసి పిల్లలకు మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో చైతన్య సర్వీసెస్ సొసైటీ సిబ్బంది కవిత, చరణ్, ఉపాధ్యాయులు, పిల్లలు పాల్గొన్నారు.

ప్రపంచ స్థాయి ప్రఖ్యాత కళాశాల జాబితాలోకి 'మిట్స్'



ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న ప్రిన్సిపల్ యువరాజ్

ప్రజాశక్తి-మదనపల్లి

మదనపల్లె సమీపంలోని మదనపల్లె ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, సైన్స్‌కు ప్రపంచ స్థాయిలో ప్రఖ్యాత కళాశాలల జాబితాలో స్థానం సంపాదించిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ అన్నారు. ఎస్‌సిఐ మాగో ఇన్‌స్టిట్యూషన్స్ ర్యాంకింగ్‌లలో ఈ ఘనత సాధించినట్లు పేర్కొన్నారు. ప్రపంచ స్థాయిలో నాణ్యమైన జర్నల్‌లు, పేటెంట్ల ఆధారంగా 2024 సంవత్సరానికి విద్య, పరిశోధనా సంస్థలకు ర్యాంకింగ్‌లను ప్రకటించింది. రీసెర్చ్ ల్యాబ్‌లు, ఐఐటిలు, ఎన్‌ఐటిలతో సహ ప్రఖ్యాత ఇన్‌స్టిట్యూట్‌ల జాబితాలో మిట్స్ కు స్థానం లభించిందని పేర్కొన్నారు. ప్రపంచ స్థాయిలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో 3573 స్థానంను, ఎనేర్జి విభాగంలో 1165 స్థానం, ఇంజనీరింగ్ విభాగంలో 3688 స్థానం, గణిత విభాగంలో 1880 స్థానం, ఫిజిక్స్ అండ్ ఆస్ట్రానమీ లో 2160 స్థానం లభించిందన్నారు. ఆంధ్ర ప్రదేశ్ నుంచి కేవలం 6 కళాశాలలు ఉండగా అందులో మిట్స్ కళాశాల ఒకటన్నారు. ప్రపంచ స్థాయిలో ప్రఖ్యాత గాంచిన మిట్స్ కలశాల ఘనతకు ప్రోత్సహించిన కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్‌కు, ఆర్‌అండ్‌డి అడ్వైసర్ డాక్టర్ తులసిరామ్ నాయుడు కు అసోసియేట్ డీన్ ఆర్‌అండ్ డి డాక్టర్ శివయ్యకు అధ్యాపకులకు, విద్యార్థులకు కళాశాల కరెస్పాండంట్ డాక్టర్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల అభినందనలు తెలియజేసారు.



విద్యా సామగ్రి పంపిణీ చేస్తున్న రమేష్ నాయుడు

విద్యార్థులు సంస్కారం అలవర్చుకోవాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

విద్యార్థులు చదువుతోపాటు క్రమశిక్షణ, సంస్కారం కూడా అలవర్చుకోవాలని విజన్స్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు పోతుగుంట రమేష్ నాయుడు తెలియజేశారు. గురువారం డిబిఎన్ పల్లె ప్రాథమిక పాఠ శాలలో ప్రధానోపాధ్యాయులు సుబ్బయ్య ఆధ్వర్యంలో విద్యార్థులు, తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పోతుగుంట రమేష్ నాయుడు పాల్గొని ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థుల నుద్దేశించి మాట్లాడుతూ విద్యార్థుల ఎదుగుదలలో ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రుల పాత్ర కూడా చాలా ప్రధానమైనదని తెలిపారు. చిన్నారులు ఇంటి వద్ద తమ తల్లిదండ్రులను చూస్తూ వారినే అనుకరిస్తూ పెరుగుతారని, కాబట్టి తల్లిదండ్రులు పిల్లల పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. పాఠశాలలో చదివి రెండవ ర్యాంకు, 27వ ర్యాంకు సాధించి ఆదర్శ పాఠశాలకు ఎంపికైన విద్యార్థులకు ప్రత్యేక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మదాలస, స్వర్ణలత, చంద్రారెడ్డి, సుబ్రహ్మణ్యంరెడ్డి, సరస్వతి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వైవీయూలో ఫైన్ ఆర్ట్స్ కోర్సుల ప్రవేశానికి దరఖాస్తులు

ప్రజాశక్తి - కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయం, లలిత కళా విభాగంలో 4 సంవత్సరాల బ్యాచిలర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ కోర్సు ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ విభాగం అధిపతి డాక్టర్ కె.మృత్యుంజయ రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సులో ప్రవేశానికి ఇంటర్‌లో ఏ గ్రూప్‌లో ఉత్తీర్ణత అయిన వారు అర్హులన్నారు. ప్రభుత్వ, ప్రయివేట్ రంగంలో ఉన్నత అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఈ నెల 10లోపు వెబ్ సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు, సందేహాలకు 9010014304లో సంప్రదించాలని పేర్కొన్నారు.

'పింగళి' వర్ధంతి, జయంతులను ప్రతి ఏటా నిర్వహించాలి

ప్రజాశక్తి - కడప

రాబోవు రోజుల్లో నైనా పింగళి వర్ధంతి, జయంతి కార్యక్రమలను ప్రతి పాఠశాలలో నిర్వహించేలా అధికారలు చర్యలు తీసుకోవాలని నజుమున్ పాఠశాల ఉపాధ్యాయురాలు శారద, ఇన్సాఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్. గౌస్ బాషా కోరారు. రాయల్ కరీం సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం గౌస్ బాషా కార్యాలయంలో జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య 61 వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత పింగళి వెంకయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్కే సేవా సమితి అధినేత అబ్దుల్ షేక్ రాయల్ కరిముల్లా, జిఎంఆర్ రెసిడెన్స్ అధినేత మదర్ భాష పాల్గొన్నారు.

మాట నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

- ఈ ఖరీఫ్ సీజన్ నుంచి పాత విధానంలోనే పంటల బీమా : ఎమ్మెల్సీ

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ఎన్ని కల సమ యంలో రాయల సీమ రైతులకు ముఖ్య మంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు 2019 కన్న ముందున్న పంటల బీమా విధానాన్ని ఈ ఖరీఫ్ నుంచే ప్రారం భించనున్నట్లు ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామ గోపాల్‌రెడ్డి తెలిపారు. పాత పద్ధతిలోనే బీమా అమలు చేయాలని ముఖ్యమంత్రి వ్యవసా యాధికారులను ఆదేశించిన నేపథ్యంలో ఎమ్మెల్సీ గురువారం వ్యవసాయశాఖ కమిషనర్ హరికిరణ్‌ను అమరావతిలో కలిసి చర్చించారు. రైతులకు సంబంధించిన పలు అంశాలపై ఆయన హరికిరణ్‌తో చర్చించారు. సీమ రైతులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

దండోరా జన జాతరను విజయవంతం చేయండి

ప్రజాశక్తి - రాయచోటి

ఈనెల 7న నిర్వహించే దండోరా జన జాతరను విజయవంతం చేయాలని ఎంఆర్‌పిఎస్ జాతీయ నాయకులు ఎస్. రామాంజనేయులు పేర్కొన్నారు. గురువారం తహశీల్దార్ కార్యాలయం సమీపంలో ఉన్న అంబేద్కర్ ఫ్లెక్సీ వద్ద మాదిగ జనజాతర కరపత్రం విడుదల చేశారు. ఈసందర్భంగా రామంజినేయలు మాట్లాడుతూ ఎంఆర్‌పిఎస్ ఉద్యమం 30 వసంతాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా 7న మధ్యాహ్నం 3గంటలకు ఉద్యమాల పురిటిగడ్డ దండోరా ఉద్యమ జన్మ స్థలం ఈదుముడిలో నిర్వహించే దండోరా జన జాతరను విజయవంతం చేయాలనిజాతికి పిలుపునిచ్చారు. అన్నిరంగాలలో వెనుకబడిన మాదిగల సామాజిక న్యాయంకోసం ఎస్‌సి వర్గీకరణ అవసరమని 30 సంవత్సరాలుగా ఎన్నో పోరాటాలు చేసి ప్రాణాలు సైతం ఫణంగా పెట్టి ఉద్యమానికి స్ఫూర్తినిచ్చిన మాదిగ ముద్దుబిడ్డల జ్ఞాపకార్థం ఏర్పాటుచేసిన దండోరా ఆత్మగౌరవ స్థూపం వద్ద నిర్వహించనున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు దుద్యాలచిన్నప్ప, సుబ్బయ్య, సురేష్, జనకయ్య, లక్ష్మీనారాయణ, బండపల్లె, శ్రీను, లక్ష్మయ్య పారిఆంజనేయులు, మూగరాములు, మాల మహానాడు నాయకులు పామయ్య, ముస్లిం నాయకులు పాల్గొన్నారు.



ఉద్యోగులకు బహుమతులు అందజేస్తున్న డిపో మేనేజర్ కుమార్

ఆర్‌టిసి ఆదర్శ ఉద్యోగులకు సన్మానం

ప్రజాశక్తి-పీలేరు

2024 జూన్ మాసంలో అత్యున్నత ప్రతిభ కనబరచిన ఆర్టీసి ఉద్యోగులను ప్రశంసాపత్రం, నగదు బహుమతితో సత్కరించడం జరిగిందని పీలేరు డిపో మేనేజర్ బండ్ల కుమార్ తెలిపారు. గురువారం స్థానిక ఆర్టీసి గ్యారేజ్ లో జరిగిన కార్యక్రమంలో గత నెల అత్యధికంగా 6.23 కెఎంపిఎల్ సాధించి 119 లీటర్ల ఇంధనం పొదుపు చేసిన డ్రైవర్ బి.ఆర్.సి నాయక్ కు ప్రథమ బహుమతిని, 5.87 కెఎంపిఎల్ ద్వారా 110 లీటర్ల డీజల్ పొదుపు చేసిన డ్రైవర్ కెవి స్వామికి ద్వితీయ బహుమతి అందుకున్నారు. అదేవిధంగా అధిక ఈపికె సాధించిన కండక్టర్లను కూడా నగదు బహుమతి, ప్రశంసాపత్రంతో అభినందించారు. ఈ సభలో ట్రాఫిక్ సూపర్వైజర్లు, గ్యారేజ్ సూపర్వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

భోలే బాబాను అరెస్టు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్ : భోలే బాబాను వెంటనే అరెస్టు చేయాలని జమ్మలమడుగు సిపిఎం కార్యదర్శి జి.ఏసుదాసు, పార్టీ నాయకులు దాసరి విజయ్ డిమాండ్ చేశారు. గురువారం సాయంత్రం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్ అత్రాస్ జిల్లా పుల్రై గ్రామంలో సూరత్ సింగ్ (అలియాస్)భోలే బాబా సత్సంగ్ పేరుతో నిర్వహించిన ఆధ్యాత్మిక సభలో భోలే బాబా ప్రసంగం అనంతరం ఆయన నడిచిన పాదాల కింద మట్టిని తీసుకోవాలని సత్సంగుకు వచ్చిన ప్రజలు తోపులాట గుర్తై 125 మంది మరణించారన్నారు. మృతుల్లో ఎక్కువమంది ఆడవారు, చిన్న పిల్లలు ఉండడం బాధాకరమన్నారు. ఈ విషాదానికి కారకులైన ప్రధాన కార్య నిర్వాహకుడు బోలె బాబాను వెంటనే అరెస్టు చేయాలని సిపిఎం డిమాండ్ చేస్తుందన్నారు. చుట్టుపక్కల రాష్ట్రాలలో బోలె బాబాకు వేలకోట్లలో ఆస్తులు ఉన్నాయని, వాటిని వెంటనే ఆ రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలన్నారు. ఇదివరకే బోలె బాబా మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడని ఆరోపించారు. ఆధ్యాత్మిక ముసుగులో ఎన్నో మోసాలకు పాల్పడ్డాడని ఆయనపై తీవ్రమైన ఆరోపణలు ఉన్నాయని వారు పేర్కొన్నారు. అయినప్పటికీ అత్రాస్ జిల్లా పోలీస్‌శాఖ భోలే బాబాపై చర్యలు తీసుకోకపోవడం చాలా దుర్మార్గమని పేర్కొన్నారు. వెంటనే ఆ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు మూఢనమ్మకాలపై సదస్సులు, సమావేశాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలన్నారు. ఆధ్యాత్మిక ముసుగులో మోసపోతున్న ప్రజలను చైతన్యవంతులుగా తీర్చిదిద్దాలని సూచించారు. మృతుల కుటుంబాలకు ఆ రాష్ట్ర ప్రభుత్వం రెండు లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించడం చాలా దుర్మార్గమన్నారు. వెంటనే బాధిత ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షలు యుపి ప్రభుత్వం ప్రకటించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆదాము, దివాకర్, ఎ.వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

రేపు కడపలో జాబ్‌మేళా

ప్రజాశక్తి - ఖాజీపేట : కడప నగరం రిమ్స్ రోడ్డులో ఉన్న స్పిరిట్ డిగ్రీ అండ్ పీజీ కళా శాలలో ఈనెల 6న శనివారం జాబ్‌మేళా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గురువారం ఇఒపిఆర్‌డి వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. గురువారం ఉదయం 9 గంటలకు జాబ్ మేళా ప్రారంభమవుతుందన్నారు. ఏదైనా డిగ్రీ, పీజీ కోర్సులో ఉత్తీర్ణులై, 30 సంవత్సరాలలోపు ఉన్న అభ్యర్థులు అర్హులని తెలిపారు. తమ అర్హతా పత్రాలతో అభ్యర్థులు సకాలంలో చేరుకోవాలని కోరారు. స్పిరిట్స్ కళాశాల ప్లేస్మెంట్ అధి కారి ఎస్ఎండి మునీర్ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఇఒపిఆర్‌డి పేర్కొన్నారు. జిల్లాలోని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఇఒపిఆర్‌డి వెంకటసుబ్బారెడ్డి కోరారు.

ఆహార పదార్థాల్లో నాణ్యతాప్రమాణాలు పాటించాలి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్ : ఆహార పదార్థాల్లో నాణ్యతాప్రమాణాలు పాటించాలని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి హోటల్ యజమానులకు సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు స్టాప్ డయేరియా ప్రోగ్రాంలో భాగంగా గురువారం పట్టణంలోని హోటళ్లను కమిషనర్ సిబ్బందితో కలిసి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో ఉన్న అన్ని హోటళ్లల్లో పరిశుభ్రంగా ఉండాలన్నారు. కల్తీ లేని ఆహారాన్ని ప్రజలకు అందించాలని సూచించారు. శుభ్రమైన ఫిల్టర్ నీటిని మాత్రమే వినియోగించాలని ఆదేశించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో హోటళ్ల యజమానులతో సమావేశమై తగిన సూచనలు ఇచ్చారు.

క్రైం కార్నర్

లారీ, టాటా సుమో ఢీ : ఇద్దరు మృతి

ప్రజాశక్తి- పుల్లంపేట

మండల పరిధిలోని కడప-చెన్నై జాతీయ రహదారిపై రెడ్డిపల్లి చెరువు కట్ట అలుగు వద్ద గురువారం తిరుపతి వైపు వెళ్తున్న లారీని కడప వైపు వెళ్తున్న సుమో ఢీకొనగా అక్కడికక్కడే ఇద్దరు మృతి చెందారు. మృతులు రెడ్డిపల్లె అరుంధతివాడ గ్రామానికి చెందిన రెడ్డి పాక వెంకటేష్(22), రేణింతల గ్రామానికి చెందిన ఎలకచర్ల సుబ్బరాయుడు(30)గా గుర్తించారు. ఇరువురి భార్యలు గర్భిణులుగా ఉన్నారు. మృతుల కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరవుతున్నారు. కుటుంబ సభ్యులను రైల్వేకోడూర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి మూక్క రూపనంద్‌రెడ్డి సతీమణి మూక్కా వరలక్ష్మి పరామర్శించి మనోధైర్యం నింపారు. రెడ్డిపల్లి అరుంధతివాడ గ్రామానికి చెందిన మృతుని కుటుంబాన్ని గ్రామ మాజీ సర్పంచ్ రొంపిచర్ల మురళి పరామర్శించారు. ఘటనపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ చిన్న పెద్దయ్య తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం రైల్వేకోడూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అందజేశారు.